జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 21 | మార్చి | 2025 ◆ పేజీలు : 4

## పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి ఒక మైలురాయి

- పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 20, ప్రజాజ్యోతి:** నేటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి హృదయపూర్వక శుభాకాంక్షలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యత గల పదవ తరగతి పరీక్షలు నేటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు

మిగతా 2 లో...





# దద్దరిల్లిన... దండకారణ్యం

- నెత్తురోడుతున్న చత్తీస్గడ్ అడవులు,
- రెండు వేరు వేరు ఎన్కౌంటర్లలో 30 మంది మావోయిస్టుల మృతి
- 2026 మార్చి నెలాఖరుకల్లా నక్సల్స్ రహిత భారత్ : అమిత్ షా

**చర్ల, మార్చి 20, ( ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్లో పోలీస్ జవాన్లకు మావోయిస్టులకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. గురువారం నాడు చత్తీస్గడ్ లోని నారాయణపూర్, బీజాపూర్ జిల్లాల్లో గురువారం నాడు జరిగిన వేర్వేరు ఎన్కౌంటర్లలో మొత్తం 30 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. 2026 మార్చి నెలాఖరుకల్లా నక్సల్స్ రహిత భారత్ గా చేయాలన్న మోడీ ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని నెరవేర్చే దిశగా పోలీస్ బలగాలు ముందుకు సాగుతున్నాయి. ఇదే క్రమంలో మావోయిస్టులు సమావేశమయ్యారని తెలుసుకున్న పక్కా సమాచారంతో, డి ఆర్ జి, ఎస్ టి ఎఫ్,కోబ్రా,బస్తర్ ఫైటర్స్ సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా తారసపడిన మావోయిస్టులు ఎదురు కాల్పులు జరపడంతో జవాన్లు సైతం ఎదురుకాల్పులు జరిపి 30 మంది మావోయిస్టులను హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎదురు కాల్పుల్లో డి ఆర్ జి దళానికి చెందిన రాజు ఓ యం అనే జవాన్ వీరమరణం పొందినట్లు బస్తర్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ సుందర రాజన్ ఒక ప్రకటనలో తెలిపార బస్తర్ డివిజన్లో మొత్తం 30 నక్సలైట్ మృతదేహాలు స్వాధీనం చేసుకున్నట్లు,బీజాపూర్ ఎన్కౌంటర్లో ఇప్పటివరకు మొత్తం 26 నక్సలైట్ మృతదేహాలు స్వాధీనం చేసుకున్నట్లు,కాంకేర్ ఎన్కౌంటర్లో ఇప్పటివరకు మొత్తం 04 నక్సలైట్ మృతదేహాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్కౌంటర్ స్థలం నుండి పెద్ద మొత్తంలో నక్సలైట్ ఆయుధాలు మరియు మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.ఎన్కౌంటర్ స్థలం నుండి పెద్ద మొత్తంలో

మిగతా 2 లో...



2 లో..

## వేసవి అండ... మట్టి కుండ!

వేడిమికి ఉపశమనం..!
అంతకంతకు ఆదరణ...



## ఆకస్మికంగా ఏహెచ్ఎస్ సర్వారం స్కూల్ తనిఖీ చేసిన ఐటిడిఏ పిఓ

**చుంచుపల్లి, మార్చి 20, ప్రజాజ్యోతి :** ఏహెచ్ఎస్ సర్వారం పాఠశాలను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం విద్యార్థులతో పలు విషయాలు ముచ్చటించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులతో కలసి ఆటలు ఆడి, విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ అందించారు. అలాగే సర్వారం పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి గేమ్స్ కు ఎంపికాబడిన దిలీప్ అనే విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.10 వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడన్స్ పై పలు సూచనలు చేశారు.ఈ



కార్యక్రమంలో ఏపిఓ డెవిడ్ రాజ్, ఏటిడిఓ చంద్రమోహన్, స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ గోపాల్ రావు పాఠశాల హెచ్ ఎం శ్రీనివాస్ ,వార్డెన్ అప్పారావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య .

**ఇల్లందు, మార్చి 20, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడ్డ ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో మరో 3 డయాలసిస్ మిషన్ లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రమైన ఇల్లందులో అన్ని వర్గాల ప్రజలకు

మిగతా 2 లో...



## పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి ఒక మైలురాయి..

(మొదటి పేజీ తరువాయి...)
అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడానికి ప్రతి విద్యార్థి ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్ ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్ లు నడిపేలా ఆర్టీసీ అధికారుల కు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాసి నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి...)
మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం రూ. 37.50 కోట్లతో 100 పడకల వైద్యశాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో డయాలసిస్ కోసం ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ వెళ్లవలసి వచ్చేదని, ప్రస్తుతం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో గతంలో ఐదు, ప్రస్తుతం మరో మూడు డయాలసిస్ మిషన్లను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో ఫిజియోథెరపీ సేవలు ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎండలో తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు వైద్యశాలలో రెండు వాటర్ కూలర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రవిబాబు, వైద్యులు డా. హర్షవర్ధన్, డా. రాంనివాస్, డా. బన్సీ, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



# దద్దరిల్లిన దండకారణ్యం

(మొదటి పేజీ తరువాయి...)
ఏ కే 47, ఎస్ ఎల్ ఆర్, ఇన్సాస్ రైఫిల్, .303 రైఫిల్, రాకెట్ లాంచర్, బి జి ఎల్ లాంచర్ ఆయుధాలు మరియు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 2024,2025 సంవత్సరంలో కూడా నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో సాధించిన ఆధిక్యాన్ని కొన సాగించడం ద్వారా, నిషేధిత మరియు చట్టవిరుద్ధమైన CPI మావోయిస్టు సంస్థకు వ్యతిరేకంగా బస్తర్ డివిజన్ కింద భద్రతా దళాలు సమర్థవంతంగా నిర్వహించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ఫలితంగా, గత 78 రోజుల్లో మొత్తం 97 మంది హార్డ్ కోర్ మావోయిస్టుల మృత దేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ శ్రీ సుందర్ రాజ్ పి తెలియజేశారు. బీజాపూర్ జిల్లాలోని గంగలూరు



పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆంద్రి గ్రామ అడవుల్లో మావోయిస్టుల ఉనికిపై సమాచారం ఆధారంగా, బీజాపూర్ డి ఆర్ జి /బస్తర్ ఫైటర్స్/ఎస్ టి ఎఫ్ /డి ఆర్ జి సుక్మా/సి ఆర్ పి ఎఫ్ పార్టీ నక్సల్ వ్యతిరేక శోధన ఆపరేషన్ కోసం బయలుదేరినట్లు బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలియజేశారు. గురువారం నాడు ఉదయం 7 గంటల నుండి మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు ప్రారంభమై ఇది సాయంత్రం వరకు అడపాదడపా కొనసాగినట్లు తెలియజేశారు. ఈ ఆపరేషన్లో సుమారు 2400 మంది జవాన్లు పాల్గొనట్లు ఆయన తెలిపారు. మావోయిస్టుల మృతదేహాల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు, గాయపడ్డ నక్సలైట్ల కోసం ఇంకా చర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

## నేటి నుండి పది పరీక్షలు

- పది పరీక్షలకు సర్వం సిద్ధం
- యం ఈ ఓ రమా




**భద్రాచలం ,మార్చి 20, ప్రజాజ్యోతి :** పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. పరీక్ష కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నేటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కేంద్రాల్లో బల్లలు, ఫ్యాన్లు, విద్యుత్ , నీరు, వైద్య సదుపాయాలు కల్పించారు. భద్రాచలంలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పా ట్లు పూర్తిచేసినట్లు యం ఈ ఓ. రమాదేవి తెలిపారు. గురువారం ప్రజాజ్యోతి తో మాట్లాడుతూ భద్రాచలం లో మొత్తం 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో నాలుగు ప్రభుత్వ పాఠశాలలు , ఒకటి ప్రైవేట్ స్కూల్ లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు . ఐదు పరీక్షా కేంద్రాలకు 5 మంది చీఫ్ సూపరింటెండెంట్ లు, 5 మంది డిపార్ట్మెంట్ అధికారులు, 70 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ప్రతి గదిలోనూ విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, ఫ్యానలు, నీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు 8.30గంటలకే వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఇన్విజిలేటర్లకు పరీక్షల నిర్వహణపై వారికి సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలవద్ద ఏర్పాటుచేసిన నోటీసు బోర్డులో తమ హాల్ టికెట్ నంబర్లను సరి చూసుకుని, కేటాయించిన గదులకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని యం ఈ ఓ రమాదేవి అన్నారు .

# వేసవి అండ... మట్టి కుండ!

## -వేడిమికి ఉపశమనం! - అంతకంతకు ఆదరణ

**ఇల్లందు, మార్చి 20, ప్రజాజ్యోతి:** భానుడి భగభగలతో వేసవి తాపం వచ్చింది.. మండే ఎండకు చల్లటి నీరు ప్రతి ఒక్కరికి కావాల్సిందే... చల్లటి మంచినీటి కొరకు ప్రతి ఒక్కరూ మట్టికుండను కొనాల్సిందే... వాతావరణ మార్పుల ప్రభావంతో పగలంతా ఎండలు, ఉక్కపోతగా ఉంటూ తెల్లవారుజామున చలిగాలులు వీస్తున్నాయి. మట్టి కుండలోని నీరు ఫ్రిజ్ లోని నీటి కన్నా ఎంతో శ్రేయస్కరం. వేసవి తాపం నుండి దాహార్తిని తీర్చుకోవడానికి కుండలు ఎంతగానో ఉపయోగపడతాయి. గతంలో మన పూర్వీకులు ఎక్కువగా మట్టి కుండల్లోనే వంటలు ఉండేవారు. నిరుపేదలకు కుండలే ఫ్రిజ్ లాగా ఉపయోగపడుతూ ఇప్పటికీ పల్లెల్లో మట్టి కుండల్లోనే నీటిని తాగుతారు. వేసవి కాలం మొత్తం దాహార్తి కోసం మట్టికుండల్లో నీటితో సేదతీరుతూ కాలాన్ని వెళ్లదీస్తుంటారు. ఫ్రిజ్ ల్లో అయితే ఉష్ణోగ్రతను బట్టి నీరు చల్లగా ఉంటుంది. అదే మట్టికుండల్లో మూడు రోజుల వరకు ఒకే మాదిరిగా చల్లగా ఉంటాయి. తరం మారినా..జనం మారినా..యుగం మారినప్పటికీ ఈ మట్టి కుండ ఆదరణ మాత్రం తగ్గటం లేదు అనేది లేదని చెప్పవచ్చు. పేదవాడి ఫ్రిజ్ గా పేరొందిన కుండలు ఇప్పటికే పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విరివిగా కనిపిస్తున్నాయి. ఎండలు విపరీతంగా పెరగడంతో కుండలకు భలే గిరాకీ పెరిగింది. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది కుండలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. మట్టి కుండల్లో ఉన్న నీరు చల్లధనంతో పాటు మనసుకు ఆహ్లాదకరంగా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు.



# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- నూతన కార్యవర్గపు సభ్యులతో గేటు మీటింగ్ ఏర్పాటు
- ఐటీసీ కి సంబంధించిన స్థలంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి



బూర్గంపహాడ్, మార్చి 20, ప్రజా జ్యోతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధి సారపాకలో గల ఐటిసి పిఎస్పిడి పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. పరిశ్రమకు సంబంధించిన పిఎం 6 గేటు వద్ద ఉదయం 8 గంటల సమయంలో గౌరవ అధ్యక్షుడు సింగమనేని ప్రసాద్, గౌరవ సలహాదారు తన్నీరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికుల అధ్యక్షుడు బల్లెం నాగయ్య , ప్రధాన కార్యదర్శి షేక్ జహూర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల నవీన్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షులు సింగమనేని ప్రసాద్ మాట్లాడుతూ ఐటిసి పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని.. శ్రమ దోపిడీ జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచకుండా కాలయాపన స్వార్థపు రాజకీయ నాయకుల అండతో కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆరోపించారు. భవిష్యత్తు లో కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉండి వారి న్యాయమైన కోరికల కొరకు దశల వారి ఉద్యమం చేపడతామన్నారు. కాంట్రాక్టు కార్మికులు అందరూ కలిసికట్టుగా ఉండి వారి కష్టాన్ని గుర్తించి వారి శ్రమకు తగిన ఫలితం అందే విధంగా ప్రతి ఒక్క కార్మికుడు ముందుకు రావాలని వారి గళాన్ని వినిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన కాంట్రాక్టు కార్మికుల నాయకులు అధ్యక్షుడు బల్లెం నాగయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ జహూర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల నవీన్, జాయింట్ సెక్రటరీ అనిల్ శర్మ, గౌతమ్, ఉపేంద్ర , కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు చేయూత



భద్రాచలం టౌన్, మార్చి 20, ప్రజాజ్యోతి : అగ్ని ప్రమాదానికి గురై సర్వం కూలిపోయిన ఎట్ల పాక మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన ధారా వెంకటేశ్వర్లు కాటూరి నరసమ్మ కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షులు చిట్టినీడు రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా రామలింగేశ్వర రావు మాట్లాడుతూ తోటపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై రెండు పూరీల్లు పూర్తిగా దగ్ధం అయిపోవడంతో ఆ రెండు కుటుంబాలు నిస్సహాయ స్థితికి చేరుకున్నాయని అన్నారు. సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో భద్రాచలం పట్టణ ప్రముఖులైన నక్క వెంకన్న సిద్ధారెడ్డిలు వెంటనే స్పందించి రెండు కుటుంబాలకు సరిపోయే నిత్యావసర వస్తువులను లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో అందించడం అభినందనీయమని అన్నారు. ఆపదలో ఉన్న తోటి వారికి సహాయం చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని దానికి అనుగుణంగానే అవసరం ఉన్న వరకు సహాయ సహకారాలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొనగా నక్క వెంకన్న, సిద్ధారెడ్డి చేతుల మీదుగా బాధితులకు కిట్లను అందించారు.

# సింగరేణి లో గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన ఏఐటియుసి

- గనుల ప్రైవేటీకరణ ను రద్దు చేయకపోతే సమ్మెకు పిలుపునిస్తాం
- కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట నిరహారదీక్షను ప్రారంభించిన సీతారామయ్య



కొత్తగూడెం సింగరేణి, మార్చి 20, ప్రజాజ్యోతి : సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలోని వికె 7ఓసి, సత్తుపల్లి ఓసి లలో బొగ్గు తీసే పనిని కాంట్రాక్టుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహారదీక్షలను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య దీక్షల్లో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. అనంతరం సీతారామయ్య మాట్లాడుతూ 2015 లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండిఆర్ చట్టంలో మార్పులు చేయడం వల్ల దేశంలో ఉన్న బొగ్గు బ్లాక్ లను వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడం వల్ల సింగరేణి లో కొత్త గనులు రావడం లేదని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చెందిన రెండు బొగ్గు గనులను సంస్థకు ఇవ్వకుండా సింగరేణి ని వేలంలో పాల్గొననీయకుండ వారి అనుయాయులకు ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఇట్టి గనులను దక్కించుకున్న వారు వాటిని ప్రారంభించలేదని ఆయన అన్నారు. ఎందుకంటే ఇల్లందు ఏరియా ట్రైబల్ ఏరియా 1/70 చట్టం ఉందని దాని ప్రకారం ప్రభుత్వానికే ఆ గని దక్కుతుందని ఆయన అన్నారు. తెలంగాణ లో ఉన్న కొత్త గనులను ప్రైవేటు కు కాకుండా సింగరేణి కి ఇవ్వాలని ఏఐటియుసి పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. వికె 7ఓసి, జెకె ఓసి లో బొగ్గు తీసే పనిని యాజమాన్యం కాంట్రాక్టు కు ఇవ్వడాన్ని ఏఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. 2000 సంవత్సరం లో ఇల్లందు, కోయగూడెం ఓసి లో ప్రైవేటు వారికి చెందిన సర్వేస్ మైనర్ కు వ్యతిరేకంగా 13 రోజులు ఏఐటియుసి గుర్తింపు సంఘంగా ఉండి సమ్మె చేసి దానిని రద్దు చేయించి కంపెనీ ఉద్యోగుల తో బొగ్గు తీసే పనిని ఒప్పందం చేయడం జరిగిందని తెలిపారు. యాజమాన్యం, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బొగ్గు తీసే పనిని కాంట్రాక్టు కు కాకుండా సింగరేణి ఉద్యోగులే తీసే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమా లు చేపడతామని, అవసరమైతే సమ్మెకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు వంగ వెంకట్, మల్లికార్జున్, జి వీరస్వామి, వి మల్లికార్జున రావు, ఎస్వి రమణమూర్తి, జె. గట్టయ్య, క్రిస్టోఫర్, సందేబోయిన శ్రీను, ఎస్ సుధాకర్, కె రములెజ్, రంగు శ్రీను, పాల్గొన్నారు.

# కీచక ఉపాధ్యాయుని ఉద్యోగం నుండి తొలగించాలి

- వసతి గృహంలో మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి
- పిడిఎస్యు, పివైఎల్ నాయకులు డిమాండ్



టేకులపల్లి, మార్చి 20, ప్రజాజ్యోతి : వసతి గృహంలో మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుండి తొలగించాలని పిడియస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ డిమాండ్ చేశారు. గురువారం పిడియస్ యు సంఘాల నాయకులు బాధిత విద్యార్థి గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడారు. టేకులపల్లి మండలం గంగారం గ్రామం ఆశ్రమ పాఠశాలలో గత రెండు రోజుల క్రితం మంగళవారం ఒక ఉపాధ్యాయుడు మద్యం సేవించి ఒక విద్యార్థిని పట్ల లైంగికంగా వేధింపులకు గురి చేశాడనే కారణంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు,గ్రామస్తులు కలిసి దేహ శుద్ధి చేసిన సంఘటన అందరికీ విధితమే. ఈ విషయం పై పి డి యస్ యూ, పి వై ఎల్ ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘాల నేతృత్వంలో జరిగిన విషయాలను చర్చించి వాస్తవ విషయాలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి వెలుగులోకి వచ్చిన విషయాలు అనేకం ఉన్నాయి. విద్యార్థినిని గత కొన్ని రోజుల నుండే వేధింపులకు గురి చేస్తున్నాడనే విషయం విద్యార్థినీ కుటుంబ సభ్యులతో చెప్పుకోలేక పోయిందని కీచక ఉపాధ్యాయుడి ప్రవర్తన స్వయంగా కుటుంబ సభ్యులే చూడడంతో దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్ కు అప్ప చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. వార్డెన్ గా తండ్రి పాత్ర పోషించాల్సిన ఆ ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వల్ల గిరిజన ఆశ్రమాలలో జరుగుతున్న ఇలాంటి సంఘటనలు చూసి విద్యార్థుల తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారని వారు ఆరోపించారు. గిరిజన ఆశ్రమాలపై తల్లిదండ్రులకు నమ్మకం కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజన శాఖ అధికారులు ఆశ్రమాలలో జరుగుతున్న ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యూ డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్, పి వై ఎల్ డివిజన్ నాయకులు ఊకె శ్రావణ్, గ్రామస్తులు రాచకొండ గోపి,జోగ సమ్మయ్య దొర యాస నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సి వర్గీకరణ అమలు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు



ఇల్లందు, మార్చి 20, ప్రజాజ్యోతి : అసెంబ్లీలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమా ర్క, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలకు మాదిగ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రవి మాదిగ ధన్యవాదాలు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ కోసం 3 దశాబ్దాల పోరాటం అంతిమంగా దేశ ఉన్నత న్యాయ స్థానం న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఆగస్టు 1, 2024, వర్గీకరణ రాష్ట్రాలు చేసుకునే విధంగా తీర్పు రావడం జరిగిందన్నారు. ఎస్సిలలో రిజర్వేషన్ల వర్గీకరణ దేశంలో మొదట తెలంగాణ రాష్ట్రం చేస్తుందని పేర్కొన్నారు. ఎస్సి వర్గీకరణ అమలుకు నిరంతరం కృషి చేసిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృషి ఎంతో ఉందన్నారు. అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ఆమోదం పొంది, మాదిగ, మాదిగ ఉపకులాల జీవితాల్లో వెలుగు నింపే వర్గీకరణ అమలుకు కట్టుబడి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారానికి, బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందే వరకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మాదిగ, మాదిగ ఉపకులాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

# మట్టి కుండ.. సల్లగుండ



భద్రాచలం ,మార్చి 20 (ప్రజాజ్యోతి ): ప్రస్తుత ఉరకలు, పరుగుల జీవితంలో ఎండతాపాన్ని తట్టుకోలేక ప్రజలు దాహం ..దాహం అంటున్నారు. కొంత మంది తమ శక్తి కొద్ది ఎలక్ట్రికల్ ఫ్రిజ్లు కొనుగోలు చేస్తే.. పేద ప్రజలు మాత్రం మట్టి కుండలను ఉపయోగిస్తున్నారు. మార్చి నెలలోనే ఎండలు మండిపోతుండడంతో పేదవాడి ఫ్రిజ్ అమ్మకాలు జోరందుకున్నాయి. మట్టి కూజాలు, కుండలు, వివిధ రకాల మట్టి పాత్రలను భద్రాచలం పట్టణంలోని పాత మార్కెట్ వద్ద విక్రయిస్తున్నారు .

## అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

- మూడు దశాబ్దాల ప్రయాణం నేటితో తుదిదశ
- పాడె మోసిన ఎమ్మెల్యే కోరం.



**టేకులపల్లి,మార్చి 20, ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే కోరం, పార్టీ నాయకులు ఉండేటి ప్రసాద్ ఇక లేరన్న వార్త అందరినీ కలచివేసింది. ఆయనను కడసారి చూసేందుకు భారీగా జనం తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు సులానగర్ లోని గల ఆయన నివాసానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ అంతిమ యాత్రలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, వారి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఉండేటి ప్రసాద్ తో ఆయనకున్న మూడు దశాబ్దాల అనుబంధ ప్రయాణం తలుచుకొని ఎమ్మెల్యే కోరం కనకయ్య,లక్ష్మి దంపతులు బోరున విలపించారు. అది చూసి ఆడున్నటువంటి గ్రామస్తులు అభిమానులు కార్యకర్తలు ఒక్కసారిగా వారి బాధలను బోరున ఏడుస్తూ కన్నీటిపర్యంగా విలపించారు. అనంతరం అంతిమయాత్రలో ఎమ్మెల్యే కూరం కనకయ్య వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ పాడెను మోశారు. ఈ అంతిమయాత్రకు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, ఇది గణేష్, భూక్య దేవా నాయక్, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డ్ లేకపోవడంతో అర్హత కోల్పోతున్న యువత

- ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలు మార్చాలి
- జనసేన పార్టీ బుర్గంపహాడ్ నాయకులు : గోవిందు వెంకటేశ్వరరావు.



**బూర్గంపహాడ్,మార్చ్ 20, ప్రజా జ్యోతి :** రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని మార్పులు చేయాలని జనసేన బూర్గంపహాడ్ నాయకులు గోవిందు వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడంతో 12 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పెళ్లిళ్లు జరిగి వేరుగా నివాసం ఉంటున్న ఎందరో యువకులు ఇంకా తల్లిదండ్రులు రేషన్ కార్డులోనే కొనసాగుతూ వచ్చారు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో నిబంధనలు ప్రకారం పాత రేషన్ కార్డులు డిలీట్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉండడంతో పలువురు యువకులు డిలీట్ ఆప్షన్ ద్వారా పాత రేషన్ కార్డులు డిలీట్ అయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యువతకు చేయూతనందించేందుకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొని వచ్చింది. ఎంతో ఆశగా శిక్షణతో పాటుగా సబ్సిడీ రుణాలు లభిస్తాయని ఉపాధి పొందవచ్చు అని ఆశతో ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవడానికి ఈ సేవా సెంటర్లకు వెళ్తే అక్కడ నిర్వాహకులు వివరాలు నమోదు చేసిన క్రమంలో రేషన్ కార్డ్ ఆప్షన్ వచ్చేసరికి ఇంతకుముందు పాత కార్డు డిలీట్ అయిన కారణంగా ఆ నెంబర్ కొడితే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని చెప్పడంతో యువకలు చాలా మంది నిరుత్సాహ పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జనసేన బుర్గంపహాడ్ మండల నాయకులు గోవిందు వెంకటేశ్వరరావు కోరారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

- పి వై ఎల్ టేకులపల్లి మండల కార్యదర్శి తోటకూరి. సతీష్



**టేకులపల్లి,మార్చి 20, ప్రజాజ్యోతి:** రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించి, నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా,పరాయి పాలనను ఎదిరిస్తూ నవ యవ్వన ప్రాయంలోనే దేశ స్వాతంత్రం, సమానత్వం కోసం నవ్వుతు ఉరికంభం ఎక్కి ఉరితాడును ముద్దాడి తమ అమూల్యమైన ప్రాణాలని తృణా ప్రాయంగా దేశం కోసం అర్పించిన విప్లవకారులు భగత్ సింగ్, రాజగురు, సుఖ దేవ్ ల 94 వ వర్ధంతి సందర్భంగా టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో విస్తృతంగా సభలు, కాగడాల ప్రదర్శన లు నిర్వహించాలని యువ తరానికి పిలుపునిచ్చారు. ప్రగతిశీల యువజన సంఘం(పి వై ఎల్) టేకులపల్లి మండల కమిటీ సమావేశం కొడెం.రవి అశ్చర్యంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టేకులపల్లి మండల కార్యదర్శి తోటకూరి.సతీష్ మాట్లాడుతూ పివైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో కాగడాలు, కొవ్వొత్తులతో ప్రదర్శనలు, గ్రూప్, కార్నర్ మీటింగ్ లు నిర్వహించాలని తెలిపారు.ఈ నెల 23వ తేదీన టేకుల పల్లి లో భగత్ సింగ్,రాజ్ గురువు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే కాగడాల ప్రదర్శనకు యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. నేడు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల మధ్య కులమతాల పేరుతో మంటలు రాజేస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసి అశాంతి నెలకొల్పడానికి కుట్రలు చేస్తుందని, మణిపూర్ రాష్ట్రంలో మతం పేరుతో మంటలు పెట్టి రాష్ట్రాన్ని రావణ కాష్టం గా మార్చి వేసిందని వారు విమర్శిం చారు. ఒక సంవత్సర కాలంలో కోటి ఉద్యోగ అవకాశలు కల్పిస్తామని చెప్పి నేడు ఉన్న ఉద్యోగానికి రక్షణ లేకుండా చేసిందని ఆరోపించారు. ఉద్యోగం రాక నిరుద్యోగులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. వెంటనే నిరుద్యోగుల సమస్యను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వా లు పూర్తిగా విఫలమైనయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతిలో యువతని భాగస్వామ్యం చేసుకోవలసిన పాలక ప్రభుత్వాలు,నేడు డ్రగ్స్, పబ్స్, గంజాయి, మత్తు పదర్థాల తో యువ శక్తిని నిర్వీర్యం చేస్తున్నాను వారు ఆరోపించారు. పెట్టుబడి దేశాల ఆధిపత్య పోరాటం లో భాగంగా మూ డవ ప్రపంచం యుద్ధం వచ్చే సూచ నలు ఉన్నాయని వారు ఆరోపించారు. కొత్తగా ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత నిరుద్యోగ యువతని లక్ష్యంగా చేసుకొని వారికి సంకెళ్లు వేసి దేశానికి తీసుకొచ్చి వదిలేస్తుంటే భార త ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నాడో యువత ఆలోచన చేయాలనీ కోరారు. భగత్ సింగ్,రాజగురు, సుఖ దేవ్ ఇచ్చిన స్ఫూర్తితో పోరాడాలని యువతరానికి పిలుపునిచ్చారు.ఈ కా ర్యక్రమంలో పి వై ఎల్ టేకులపల్లి మండల నాయకులు భూక్య. లక్ష్మణ్, పూ నేం. సమ్మయ్య, జార్జి, రామ, గవాస్కర్, బాబు లాల్, బాలాజీ, రమేష్, కొటేష్ పాల్గొన్నారు.

## జిఎం సార్ మా గ్రామాన్ని అభివృద్ధి చేయరా?



**టేకులపల్లి, మార్చి20, ప్రజాజ్యోతి :** మండలంలోని పెట్రాం చెలుక స్టేజి ఇల్లందు ఏరియా కోయగూడెం ఓసి ప్రభావిత ప్రాంతమైన అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్తులు ఆరోపస్తున్నారు. గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి రాస్తాకో నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అభివృద్ధి సింగరేణి యాజమాన్యం చేయలేదని వారు ఆరోపించారు. కేవలం దుమ్ము, దూళి మాత్రమే మాకు అభివృద్ధిగా సింగరేణి యాజమాన్యం చేసిందని వారు ఆరోపించారు. మా ఊర్లో ఉన్నటువంటి ఆంజనేయం స్వామి ఆలయం అభివృద్ధి చేస్తామని మాటలు చెప్పి సింగరేణి యాజమాన్యం వదిలేసిందని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తులు మా ఊరిని అభివృద్ధి పథంలో నడపాలని అలాగే రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, రోడ్డు సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయాలని ఇల్లందు ఏరియా జిఎంకు ధర్నా అనంతరం లేఖ ను గ్రామస్తులు సింగరేణి యాజమాన్యానికి ఇచ్చారు. బోడు పోలీసులు గ్రామస్థులకు సర్ది చెప్పి ధర్నాన్ని విరమింప చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ బ్యాంకింగ్ అవార్డు అందుకున్న రాజేంద్ర నాయక్




**ములకలపల్లి, మార్చి 20, ప్రజాజ్యోతి:** మండలంలోని పూసుగూడెం ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ బి రాజేంద్ర నాయక్ ఉత్తమ బ్యాంకింగ్, అత్యుత్తమమైన సేవల గాను రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. గతంలో ములకలపల్లి శాఖ లో విధులు నిర్వహించి బదిలీ పై పూసుగూడెం బ్రాంచ్ కు వెళ్ళిన రాజేంద్రనాయక్ ములకలపల్లి శాఖలో బ్రాంచ్ మేనేజరుగా విధులు నిర్వస్తున్న సమయంలో బ్యాంకు లో అత్యుత్తమమైన సేవలు ఆదించి బ్యాంకు అప్గ్రేడ్ కు దోహదపడ్డారు. ఆయన సేవలను గుర్తించిన యాజమాన్యం రాష్ట్ర స్థాయి అవార్డును అందజేసింది. హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఎస్బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.స్థానిక బ్యాంకు సిబ్బంది, అధికారులు, మండల ప్రముఖులు, నాయకులు, రైతులు ఆయనకు అభినందినలు తెలిపారు.

## పదికి పరీక్షలకు ఏర్పట్లు పూర్తి

- సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
- ఎంఇఓ జి సత్యనారాయణ



**ములకలపల్లి, మార్చి 20, ప్రజాజ్యోతి:** నేటి నుంచి మండలంలో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పట్లు పూర్తి అయ్యాయని ఎంఇఓ జి సత్యనారా యణ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్నారు. పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరా లు ఏర్పటు చేయడం జరిగిందన్నారు. కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేసి ఉంచాలని, విద్యార్థులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు గాడ్జెట్లు తీసుకురావద్దని, అలాంటి వస్తువులు పరీక్షా కేంద్రాలోని అనుమతించబడవన్నారు. గురుకుల పాఠశాల లో 119 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130మంది విద్యార్థులు మొత్తం 249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.35 వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారని అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణం లో పరిక్షలు రాసే విధంగా చూడాలని సిబ్బందిని కోరారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.